


మోదీ అధికారంలోకి వస్తే అధోగతే
» మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు ధ్వజం
» ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం
పేజీ - 7

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు
పేజీ - 7

తిరుగుబాటు ముసలం

- ప్రత్తిపాడు వైసీపీలో తిరుగుబాటు
- టిక్కెట్ నిరాకరించిన అధిష్ఠానంపై ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ధిక్కరణ
- కొత్త ఇన్‌ఛార్జిగా వరుపులను నియమించినా ఎమ్మెల్యే బేఖాతరు
- పార్టీలో ఉంటూనే టిక్కెట్‌పై తాడోపేడే తేల్చుకోవడానికి రెడీ అయిన పర్వత
- ఈనెల 12 నుంచి ప్రజాదీవెన పేరుతో జనంలోకి వెళ్తున్నట్టు ప్రకటన
- పర్వత ప్రకటనతో నియోజకవర్గ వైసీపీలో ముసలం: రెండుగా చీలిన పార్టీ
- అటు ఎమ్మెల్యే తీరుపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన కొత్త ఇన్‌ఛార్జి వరుపుల

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీలో ముసలం రాజుకుంది. పార్టీ రెండుగా ముక్కలయ్యే పరిస్థితి దాపురించింది. వచ్చేఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించడంతో వైసీపీ అధిష్ఠానంపై ఎమ్మెల్యే పర్వత తిరుగుబాటు లేవనెత్తారు. జగన్ తీసుకున్న నిర్ణయంపై ధిక్కారం ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంనుంచి పోటీ చేయబోయే కొత్త ఇన్‌ఛార్జిని అధికారికంగా ప్రకటించిన తర్వాత కూడా ఎమ్మెల్యే ఏ మాత్రం తగ్గడం లేదు. పార్టీ నిర్ణయంతో సంబంధం లేకుండా ఈనెల 12నుంచి జనంలోకి బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. తద్వారా అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తన పనితీరు, కొత్త ఇన్‌ఛార్జిగా నియమితులైన వరుపుల సుబ్బారావు పనితీరు సీఎం జగన్ బేరీజు వేస్తారంటూ వైసీపీ పెద్దలకు ఝలక్ ఇచ్చారు. తద్వారా టిక్కెట్ తనకు ఇచ్చి తీరాల్సిందేనన్న సంకేతాలు పంపినట్లయింది. పర్వత ప్రకటనతో నియోజకవర్గంలో ముసలం రాజుకున్నట్లయింది. అటు కొత్త ఇన్‌ఛార్జి వరుపుల, ఇటు ఎమ్మెల్యే పర్వత ఇద్దరూ పోటా పోటీగా నియోజకవర్గంలో తిరగనుండడంతో క్యాడర్ తలపట్టుకుంటోంది. ఎటువైపు ఉండాలో తెలియక సతమతమవుతోంది. ఎమ్మెల్యే పర్వత ప్రకటనపై అధిష్ఠానానికి వరుపుల ఫిర్యాదు చేశారు. తనను పనిచేయనివ్వడం లేదని పెద్దలకు తెలిపారు.

పేరు చెప్పాక కూడా...

ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీలో జరిగిన పరిణామాలు పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారాయి. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ఏకంగా అధిష్ఠానంపై తిరగబడ్డంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే తీరుతో పార్టీ రెండు ముక్కలైన పరిస్థితి తలెత్తడంతో ఎలా సద్దుమణిగేలా చేయాలో అర్థం కావడం లేదు. పనితీరు బాగోకపోవడం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే పర్వతకు వైసీపీ అధిష్ఠానం ఇటీవల టిక్కెట్ నిరాకరించింది. సీఎం జగన్, పార్టీ జిల్లా పరిశీలకుడు మిథున్‌రెడ్డి దగ్గరకు పిలిపించుకుని మరీ టిక్కెట్ ఇవ్వడం లేదని పర్వతకు తేల్చి చెప్పేశారు. ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావును కొత్త ఇన్‌ఛార్జిగా నియమిస్తూ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో వరుపులకు సహకరించాలని పర్వతకు స్పష్టం చేసింది. దీంతో పార్టీ తీసుకున్న నిర్ణయంతో పర్వత వేరే పార్టీలోకి వెళ్తారని ప్రచారం జరిగింది. కానీ ఇటీవల సీఎం జగన్ కాకినాడ పర్యటనకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే పర్వత సీఎంను కలిశారు. ఈ నేపథ్యంలో పార్టీపై పర్వతకు ఆగ్రహం కొంత చల్లారినట్లేనని, ఇబ్బంది లేదని పెద్దలు భావించారు. తీరా సోమవారం ఆయన బాంబు పేల్చడంతో పార్టీకి షాక్ తగిలినట్లయింది. టిక్కెట్ ఈయనకు తప్పించి వేరొకరికి ఇచ్చిన తర్వాత కూడా ఈనెల 12నుంచి తాను ప్రజాదీవెన కార్యక్రమాన్ని రౌతులపూడినుంచి ప్రారంభిస్తానని ప్రకటించడంతో వైసీపీపై ఎమ్మెల్యే తిరుగుబాటు జెండా ప్రకటించారు. పార్టీ అధినేత స్వయంగా పర్వత టిక్కెట్ చింపేసిన తర్వాత తిరిగి టిక్కెట్ తనకే వస్తుందని, తన క్యాడర్ మనోభావాల మేరకు ప్రజల్లోకి వెళ్తానని సోమవారం ప్రకటించడంతో అధిష్ఠానంపై ధిక్కరణ ప్రకటించినట్లయింది. తన పనితీరు, కొత్త ఇన్‌ఛార్జి వరుపుల సుబ్బారావు పనితీరు సీఎం జగన్ పరిశీలిస్తారని, ఆ తర్వాత టిక్కెట్ నిర్ణయం తీసుకుంటారని చెప్పడం ద్వారా తాను తగ్గేదిలేదని, పార్టీ నిర్ణయంతో తనకు సంబంధం లేదని ఎమ్మెల్యే తెగేసి చెప్పినట్లయింది. మరోపక్క ఎమ్మెల్యే పదవి ఐదేళ్లు అని మొత్తం ఐదేళ్ల పదవిని పూర్తి చేస్తానని ప్రకటించడం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నియోజవర్గంలో వైసీపీ రెండుగా చీలిపోయింది. కొత్త ఇన్‌ఛార్జి వరుపుల వర్గం, ఎమ్మెల్యే పర్వత వర్గంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో పార్టీలో రాజుకున్న కుంపటిపై వైసీపీ పెద్దలు సైతం తలపట్టుకుంటున్నారు. ఎమ్మెల్యేను పక్కనపెట్టిన తర్వాత కూడా ఇప్పుడు తిరుగుబాటు చేయడంపై ఏం చేయాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఒప్పించి దారికి తేవడమా? లేదంటే క్రమశిక్షణ చర్యల కింద పార్టీనుంచి సస్పెండ్ చేయడమా? అని ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. అధిష్ఠానం ఒకవేళ సస్పెండ్ చేస్తే సానుభూతి అయినా మిగులుతుందని, తద్వారా రాజకీయంగా తనకు మేలు జరుగుతందనే వ్యూహంలో భాగంగానే పర్వత ఈ తిరుగుబాటు బాట పటారా? అనే సందేహాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సస్పెన్షన్ వరకు తీసుకువెళ్తే రాబోయే ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గాను, లేదా మరో పార్టీలో చేరి పోటీ చేయాలనే ఆలోచనతోనే ఇలా పర్వత అడుగు వేసినట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది.



ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలో ప్రజాదీవెన పోస్టరు రిలీజ్ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత

ఆయనా.. నేనా..

ఎమ్మెల్యే పర్వత తీరుతో కొత్త ఇన్‌ఛార్జి వరుపుల సుబ్బారావు కుతకుతలాడుతున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తనను వైసీపీ అధిష్ఠానం ప్రకటించిన తర్వాత కూడా పార్టీ ముక్కలయ్యేలా పర్వత వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్నారు. ఈ మేరకు సోమవారం నాటి పరిణామాలను పార్టీ పెద్దలకు వరుపుల వివరించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే తీరుతో నియోజకవర్గంలో పార్టీ చీలిపోయిందని, క్యాడర్ సైతం రెండు వర్గాలుగా విడిపోవడంతో రానున్న ఎన్నికల్లో పార్టీకి మరణశాసనంగా మారుతోందని వరుపుల భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానానికి ఘాటుగానే పర్వత తీరుపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వాస్తవానికి తనను ఇటీవల ఇన్‌ఛార్జిగా ప్రకటించిన తర్వాత కూడా పార్టీ నేతలు, క్యాడర్‌ను తన వద్దకు వెళ్లవద్దని పర్వత హుకుం జారీ చేశారని వరుపుల ధ్వజమెత్తారు. తన వద్దకు వచ్చే వైసీపీ నేతలను బెదిరిస్తున్నట్టు ఆరోపించారు. ఇప్పుడు తాజాగా తనను ఇబ్బంది పెట్టేలా, నియోజకవర్గంలో తనకు బలం లేకుండా చేయడానికే పర్వత ఇలా చేస్తున్నారని వరుపుల చెబుతున్నారు. రెండేళ్లుగా పార్టీలో తనను ఎమ్మెల్యే తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, ఇప్పుడు ఇన్‌ఛార్జి పదవి వచ్చిన తర్వాత కూడా పార్టీని దెబ్బతీస్తూ తనను వేధిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో పర్వతపై చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలను కోరినట్లు తెలిసిందే. పర్వత, వరుపుల ఎపిసోడ్‌తో నియోజకవర్గంలో పార్టీ సర్వనాశనం అయిందంటూ క్యాడర్ గగ్గోలు పెడుతున్నారు. పర్వత తీరుతో మున్ముందు పార్టీ అడ్రస్ గల్లంతవవడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. మరికొందరైతే టీడీపీలో చేరికకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

‘రా.. కదలిరా..’ బహిరంగ సభకు చకచకా ఏర్పాట్లు



తునిలో కొబ్బరికాయ కొట్టి సభా వేదిక పనులు ప్రారంభిస్తున్న యనమల

- తునిలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు
- సభా స్థలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

తుని రూరల్, జనవరి 8: యువగళం పాదయాత్ర విజయోత్సవం తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను సంఘటితపరుస్తూ వైసీపీ పాలనలో దెబ్బతిన్న వర్గాలను, నష్టపోయిన రైతుల్లో ధైర్యాన్ని నింపేందుకు తలపెట్టిన రా.. కదలిరా.. భారీ బహిరంగసభ కాకినాడ ఎంపీ పరిధిలో తునిలో బుధవారం జరగనుంది. టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్ట్, విడుదల తర్వాత ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమం కావడంతో పార్టీ శ్రేణులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సభను నిర్వహించేందుకు సన్నద్ధమయ్యా రు. పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాలనుంచి చంద్రబా బు సభకు అధికసంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో తునిలో సభాప్రాంగణంవద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

పనుల పర్యవేక్షణ

తుని పట్టణ శివారు చామవరం రోడ్డును ఆనుకుని 15ఎకరాలపైబడి ఉన్న భారీ లేఅవుట్‌లో ఇప్పటికే సభా ఏర్పాట్లను మాజీమంత్రి యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణమూర్తి, యనమల కృష్ణుడు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇటు తొండంగి వైపునుంచి వచ్చే వాహనాలు చామవరం వైపు, కాకినాడ పార్లమెంట్ పరిధిలో వివిధ జాతీయ రహదారి గుండా తుని సభకు వచ్చే వాహనాలకు జీఎన్‌టీ రోడ్ కోమటిచెరువు ఆనుకుని పార్కింగ్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణానికి 400 మీటర్ల పరిధిలో హెలిప్యాడ్ పనులను పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, స్థానిక పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు సోమవారం పరిశీలించారు. ఇప్పటికే టీడీపీ కీలక నేతలు సభా వేదిక వద్దకు చేరుకుని పనుల పురోగతి పరిశీలిస్తున్నారు.

రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం

రాష్ట్ర భవిష్యత్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు అవసరమని కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. తునిలో జరగనున్న రా.. కదలిరా సభ ఆవశ్యకతను ఉద్దేశించి మాట్లాడారు. 42ఏళ్ల క్రితం అన్న ఎన్టీఆర్ పిలుపు మేరకు ఎలాంటి స్పందన వచ్చిందో అదే రీతిలో నేడు చంద్రబాబు రా.. కదలిరా సభకు అంతటి స్పందన ప్రజలనుంచి వస్తుందన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని అవినీతికి పరాకాష్టగా మార్చిన జగన్ పాలనపై ప్రజలు విసుగు చెంది ఉన్నారన్నారు. అక్రమ మద్యం, భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్‌కు అంగన్‌వాడీలు, కార్మికులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కినా కనీస స్పందన లేదన్నారు. రైతులు నిండా మునిగి ఉంటే వారిని ఆదుకోవడంతో ముఖ్యమంత్రి విఫలమయ్యారన్నారు. తమ అధినేత చంద్రబాబు సభకు కాకినాడ పార్లమెంట్ పరిధి తునిలో జరుగుతున్న బహిరంగసభ విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే, టీడీపీ నేత నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మోతుకూరు వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, ఎస్.సురవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగసోమరాజు(అబ్బాయి), వి.కొత్తూరు మాజీ సర్పంచ్ తమరాన రామకృష్ణ ఉన్నారు.



హెలిప్యాడ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ



తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంవద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

- అర్ధనగ్న ప్రదర్శన.. బైక్‌ర్యాలీతో నిరసన
- నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 8: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం, స్వాతంత్ర్య సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె 6వ రోజు కొనసాగుతోంది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సమస్యలు పరిష్కరించకుండా ప్రత్యామ్నాయ పనులు చేపడితే అడ్డగిస్తామని తెలిపారు. బైక్ ర్యాలీని కరణంగారి సెంటర్‌నుంచి ప్రారంభించి జీపీపీ రోడ్, కొండయ్యపాలెం, భానుగుడి సెంటర్, టూ టౌన్, మెయిన్‌రోడ్, జగన్నాథపురం, సినిమారోడ్, వినాయక కేఫ్ సెంటర్ మీదుగా భానుగుడి సెంటర్‌కు చేరుకుని బైక్‌లతో మానవహారం నిర్వహించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడించి అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నినాదించారు.



సీఎం జగన్ పాలనలో తమ బతుకులు ఇలా ఉన్నాయని తెలియజేస్తూ ప్రత్తిపాడులో గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల వినూత్న ఆందోళన

- ప్రత్తిపాడులో గడ్డి తింటూ నిరసన
- సీఎం జగన్ పాలనలో తమ బతుకులు ఇలా ఉన్నాయంటూ ప్రదర్శన

ప్రత్తిపాడు, జనవరి 8: ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు సోమవారం గడ్డి తింటూ వినూత్న నిరసన తెలియజేశారు. 28రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తూ ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని వారు మండిపడ్డారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో అంగన్‌వాడీల బతుకులకు గడ్డి తిని జీవించే దుస్థితి ఎదురైందని విమర్శించారు. అంగన్‌వాడీల ఆందోళనకు సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సత్తిరాజు, మండల నాయకులు రొంగలి ఈశ్వరరావు మద్దతు ఇవ్వగా ఆందోళనలో అల్లాడి లక్ష్మి, పద్మ, వెంకటలక్ష్మి, తులసి, నాగసత్యవతి పాల్గొన్నారు. ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయంవద్ద అంగన్‌వాడీల ఆందోళనలో భాగంగా సోమవారం ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలపట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వారు ఎండగట్టారు. ఈ ఆందోళనలో కాకరపల్లి సునీత, కె.బంగారుపాప, రాణి, గంగాభవాని, పార్వతి పాల్గొన్నారు.



వైసీపీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరుతున్న జగ్గంపేటలోని టవర్ కాలనీకి చెందిన 50కుటుంబాల వారు

టీడీపీలో భారీగా చేరిన వైసీపీ శ్రేణులు

జగ్గంపేట, జనవరి 8: జగ్గంపేటలోని టవర్ కాలనీకి చెందిన వైసీపీకి చెందిన 50 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. వారికి జగ్గంపేట టీడీపీ ఇన్‌చార్జి జ్యోతుల నెహ్రూ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ బీసీ, ఎస్సీలను వెన్నుపోటు పొడిచారని, సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించాడని ఆరోపించారు. బీసీలకు కొత్తగా పథకాలు ప్రవేశపెట్టకపోగా ఉన్న పథకాలను రద్దు చేశాడన్నారు. ప్రజల్లో మార్పు కనిపిస్తోందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చూపిస్తున్న సవతి తల్లి ప్రేమను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఓటును వజ్రాయుధంగా చేసుకొని వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అప్పలరాజు, భద్రం, పోతుల మోహనరావు, జీనుమణిబాబు, కొత్తకొండబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, దాపర్తి సీతారామయ్య, తుమ్మల కిషోర్, పిలామహేష్, కుంచే తాతాజీ, వైభోగుల కొండబాబు, సాంబతుల చంద్రశేఖర్, గెద్దాడ సత్యవేణి, కుప్ప తాతారావు, మారెళ్ల వెంకటరావు, చిక్కాల శివ పాల్గొన్నారు.

కాకినాడలో తెలంగాణ డిప్యూటీ సీఎం

కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఓ ప్రైవేటు ఫంక్షన్ నిమిత్తం సోమవారం రాత్రి కాకినాడ విచ్చేశారు. ఇక్కడి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. ఆయన్ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మంత్రి పినిపే విశ్వరూప్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.



తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

ఉమ్మడి ‘తూర్పు’ జిల్లాలో పలువురు సీఐల బదిలీలు

పిఠాపురం, జనవరి 8: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీఐలను బదిలీచేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పిఠాపురం సీఐగా పనిచేసి ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న వైఆర్‌కే శ్రీనివాస్‌ను సర్పవరం సీఐగా నియమించారు. ఇప్పటివరకూ సర్పవరం సీఐగా ఉన్న ఏ.మురళీకృష్ణను విజయవాడ పోలీసు కమిషనరేట్‌కు ఎటాచ్ చేశారు. కాకినాడ డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గణేష్, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్‌లను విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. కాకినాడలో దిశ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.గోవిందరావును ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. విజయవాడ దిశ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కె.వాసవిని తూర్పుగోదావరి జిల్లా దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కడియం సీఐ పి.బి.జె.తిలక్‌ను పశ్చిమగోదావరి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

ఆర్అండ్‌బీ ఈఈపై దాడి చేసిన 10మందిపై కేసు

కిర్లంపూడి, జనవరి 8: కిర్లంపూడి మండలం రాజుపాలెం-రామవరం రోడ్డు విస్తరణ పనుల పరిశీలనకు వచ్చిన పెద్దాపురం ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావుపై ఇటీవల దాడి చేసిన పదిమంది యువకులపై కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. దాడికి పాల్పడిన పదిమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే వెంకటేశ్వరరావు తనపై జరిగిన దాడిని ఆర్అండ్‌బీశాఖ జిల్లా ఎస్ఈకి, రాష్ట్ర సంఘం నాయకుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

రేపు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 8: కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో వివిధ కంపెనీల్లో పనిచేయడానికి ఈనెల 10న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తిగల పురుషులు, మహిళలు ఒరిజనల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 08842373270, 9652142169 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు డయల్ యువర్ డీఎం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 8: కాకినాడ ఆర్టీసీ డిపోలో ఈనెల 10న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు ఈ కార్యక్రమం ద్వారా 9959225534 నెంబరులో తెలియజేయవచ్చన్నారు.

మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అధోగతే

పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారు

వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు ధ్వజం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న వడ్డే శోభనాదీశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2024లో మళ్లీ అధికారంలోకి వస్తే రైతులకు అధోగతి తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీతో పాటు దానికి మద్దతు పలికే అన్ని రాజకీయ పార్టీలను ఓడించాలన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభల్లో తొలిరోజు సోమవారం ఆయన మాట్లాడారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే వ్యవసాయ సంబంధిత నల్ల చట్టాలను తిరిగి అమలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మార్చి వేసి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందన్నారు. మోదీ పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని, అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లలో రైతులకు ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని, కానీ రూ.14.65 లక్షల కోట్ల కార్పొరేట్ సంస్థల రుణాలు రద్దు చేశారని మండిపడ్డారు. ఒక్కసారైనా రుణమాఫీ చేయాలని కోరినా మోదీ పట్టించుకోవడంలేదన్నారు. దాదాపు 40 శాతం మంది రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి వాటిని తీర్చే దారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 12న విజయవాడలో రైతాంగ సమస్యలపై భారీ స్థాయిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ 26న రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం స్ఫూర్తితో కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధర కోసం బలమైన ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా అనేక రాష్ట్రాలు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకించినా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రం సై అనడం రాష్ట్ర రైతాంగానికి శాపంగా మారనుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. ముందుగా మున్సిపల్ స్టేడియం నుంచి రైతు మహా ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ నాయకులు కేశవశెట్టి జెండా ఆవిష్కరించారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ బృందం రైతు ఉద్యమ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, గాలిచంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు, సింహాద్రి ఝాన్సీ, వివిధ రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మహాసభల సందర్భంగా రైతు సంఘాల ప్రదర్శన

ఫోరెన్సిక్ సేవలు కీలకం

ఐజీ అశోక్‌కుమార్


ఐజీని జ్ఞాపికతో సత్కరిస్తున్న శేషారెడ్డి

గండేపల్లి, జనవరి 8: నేరాన్వేషణలో ఫోరెన్సిక్ శాఖ పోలీస్ శాఖకు చాలా కీలకమైందని ఐజీ వీవీ జి.అశోక్‌కుమార్ చెప్పారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో డిగ్రీ, పీజీ కళాశాల ఫోరెనిక్స్ సైన్స్ విభాగంలో ఫోరెన్సిక్ వివిధ నూతన అన్వేషణ పద్ధతులు అలాగే వాటి అధ్యయనం అనే అంశాలపై రెండు రోజులు పాటు జరిగే జాతీయ సమావేశాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఆదిత్య అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీ జి. అశోక్‌కుమార్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎం.నాగిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు విభాగంలో ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు మన ఆంధ్రలో ఆదిత్య విద్యాసంస్థలు ఉండడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో నేరాలు, ఆన్‌లైన్ మోసాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరాన్వేషణలో ఎటువంటి చర్యలు తీసుకుంటారో అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జైశంకర్, ఫైండర్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జస్టిస్, పోలీస్ సైన్సెస్ బెంగళూరు రాజేష్‌కుమార్, ఫోరెన్సిక్ శాఖాధిపతి, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ ఔరంగాబాద్, డాక్టర్ రంజిత్ సింగ్, డైరెక్టర్ షెర్లక్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ న్యూఢిల్లీ శాస్త్రవేత్త మధుసూదన్‌రెడ్డి కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్లమల్లి సతీష్ రెడ్డి ప్రిన్సిపాల్ విలాస్ అనీల్ చవాన్, జగ్గంపేట, గండేపల్లి పోలీసులు పాల్గొన్నారు.

విశిష్ట సేవా పురస్కారాలు


గోపాలకృష్ణకు అంతర్జాతీయ నాటక కళారత్న అవార్డు ప్రదానం

అమలాపురం టౌన్, జనవరి 8: మానవతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.బాలయోగి అన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సేవా సమితి 49వ వార్షికోత్సవానికి వ్యవస్థాపక అధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు అధ్యక్షత వహించగా బాలయోగి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సమితి మానవతా దృక్పథంతో విభిన్న రంగాల్లో సేవలు అందించడం విశేషమన్నారు. మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, మాజీ మంత్రి పరమట వీరరాఘవులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి రామకృష్ణారావు సేవలను ప్రశంసించారు. ప్రవాస భారతీయుడు కూచిభొట్ల ఆనంద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటక రంగ అకాడమీ మాజీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సంఘ సేవకులు మోహన్ దేవు, పేడి శర్మ, ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావుకు విశిష్ట సేవా పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, ఎంవీఎల్ఎన్ మూర్తి, కుడుపూడి శాంతిభూషణ్, వాసంశెట్టి జగదీశ్, బీవీవీ సత్యనారాయణ, కరాటం ప్రవీణ్ పాల్గొన్నారు.

టీడీపీ 'రా కదలిరా' సభకు భారీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తుని రూరల్, జనవరి 8: తునిలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో 'రా.. కదలిరా..' కార్యక్రమం జరగనుంది. దీనికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తుని పట్టణ శివారు చామవరం రోడ్డును ఆనుకుని ఉన్న భారీ లేఅవుట్‌లో సభా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నేత యనమల కృష్ణుడు సోమవారం తునిలో సమావేశమయ్యారు. సభా ప్రాంగణానికి 400 మీటర్ల పరిధిలో హెలిప్యాడ్ పనులను పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈనెల 10న తునిలో జరగనున్న రా.. కదలిరా సభకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరుకానున్నారని, భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు రానున్నారని, ప్రజలు కూడా భారీ సంఖ్యలో వస్తారని కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా 500పైబడి వలంటీర్లు సేవలు అందించనున్నారన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ నుంచే పోటీ

జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్



విలేకర్లతో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : వచ్చే ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా తాను బరిలో ఉంటానని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, తూర్పుగోదావరి జిల్లాలో అది మరింత తీవ్రంగా ఉందని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం జనసేన పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి నిర్ణయిస్తారని.. అదే ఫైనల్ అన్నారు. చాలా సందర్భాల్లో సిట్టింగ్‌లకు సీటు ఇస్తామని చంద్రబాబు చెప్పి ఉండొచ్చని అయితే పొత్తు ధర్మం ఉంటుందన్నారు. ఇరు పార్టీల అభ్యర్థులు త్యాగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 10న తునిలో జరిగే చంద్రబాబు బహిరంగ సభకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. జగన్మోహనరెడ్డి తాను పేదవాడినని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలో జనసేన పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనేది సంక్రాంతి పండగ ముందు తేలుతుందన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై స్పందిస్తూ వైసీపీ పార్టీలో ఒక సంస్కృతి ఉంటుందని, ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు ఇలా మారుతూనే ఉంటారని, అభ్యర్థి ఎవరనేది చివరి వరకూ చెప్పలేమని దుర్గేష్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ

ఇద్దరు యువకులు దుర్మరణం


త్రిమూర్తులు (ఫైల్)

కపిలేశ్వరపురం, జనవరి 8: రెండు వేర్వేరు బైక్‌లపై ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు-కాలేరు రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం సోమవారం కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన పెందుర్తి సతీష్ (19), కె.గంగవరం మండలం ఎండగండికి చెందిన కడలి త్రిమూర్తులు (32) సోమవారం రాత్రి బైక్‌లపై ఎదురెదురుగా ప్రయాణిస్తూ నల్లూరు-కాలేరు రహదారి మధ్య ఢీకొన్నారు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమైన త్రిమూర్తులు అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలపాలైన సతీష్‌ను 108లో మండపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. కాగా ఎండగండికి చెందిన త్రిమూర్తులు వివాహితుడు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు అంగర ఎస్ఐ చంటి తెలిపారు.

ఐటీడీఏ స్పందనకు 32 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ అధికారులు

రంపచోడవరం, జనవరి 1: స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను కోరారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి స్పందన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సుమారు 32 అర్జీలు అందాయన్నారు. కాకవాడ-కొయ్యలగూడెం రోడ్డుకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని, వేముకొండ-తూన్నూరుకు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని, శ్రీపురం గ్రామానికి పవర్ టిల్లర్లు సబ్సిడీపై మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ డీఎస్ శాస్త్రీ, డీడీ అబునసలాం, ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఎల్‌పీవో రాఘవన్, ఈఈలు డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, సుబ్బయ్య, ఎ.రవికుమార్, సీహెచ్‌కేవీ చౌదరి, సావిత్రి, పీఏవో రాంబాబు, వైద్యాధికారులు ఇందిరా, గోపిక, సీడీపీవో సంధ్యారాణి, ఎంపీడీవో హరికృష్ణ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నంతో కలకలం


కలెక్టరేట్ వద్ద రోదిస్తున్న మహిళ

అమలాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. దీంతో పోలీసులు అప్రమత్తమై కలెక్టరేట్ గేటు మూసివేసి అర్జీదారులను తనిఖీ చేసిన తర్వాతే అనుమతించారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన కొండేపూడి జ్యోతి జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ ఎదుట కలెక్టరేట్ ప్రాంగణంలో తన సమస్యను జేసీకి చెబుతూ ఒక్కసారిగా వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై చల్లుకుని అగ్గిపెట్టె తీసేందుకు ప్రయత్నించడంతో అక్కడే ఉన్న సిబ్బంది, ఇతరులు అప్రమత్తమై అడ్డుకున్నారు. దాంతో జ్యోతి సమస్యను విని న్యాయం చేస్తానని హామీ ఇచ్చి జేసీ నుపూర్‌అజయ్ స్పందన హాలులోకి వెళ్లిపోయారు. అయితే ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో వారు అప్రమత్తమై బాధితురాలు కొండేపూడి జ్యోతి నుంచి కేసు వివరాలు నమోదు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఉప్పే బాపిరాజుకు కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకునేందుకు రూ.3 కోట్లు రుణం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుంచి రూ.53 లక్షలు తీసుకుందని ఆరోపిస్తూ కొండేపూడి జ్యోతిపై గత కొన్ని నెలల క్రితం కోర్టు ద్వారా ప్రైవేటు కేసు వేశారు. దాంతో కోర్టు ఆదేశాలపై గత ఏడాది డిసెంబరు 11న ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే అప్పటి నుంచి జ్యోతిపై పోలీసులు, కేసు పెట్టిన ఉప్పే బాపిరాజు వేధింపులు తీవ్రం కావడంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈ ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు సమాచారం.

'ఆదిత్య'లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క


భట్టివిక్రమార్కతో మాట్లాడుతున్న శేషారెడ్డి

గండేపల్లి,జనవరి 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయనకు క్యాంప్ అధినేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, మాజీ మంత్రి తోట నరసింహం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదిత్య శేషారెడ్డి తనకు మంచి మిత్రుడన్నారు. ఆదిత్య క్యాంపస్ ఎంతో ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి చెందిందన్నారు. త్వరలోనే ఈ క్యాంపస్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, పేపకాయల రాంబాబు, తోట రాంజీ, తోటకూర సాయి రామకృష్ణ, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చతుర్వేద యాగం


పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

రాజానగరం, జనవరి 8: అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా లోక కల్యాణం, విశ్వశాంతి కోరుతూ గైట్ ప్రాంగణంలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేద మహాయాగం క్రతువులు సోమవారం ముగిశాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవ స్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), బదరీలక్ష్మీ దంపతులు, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ, శేషపవిత్ర దంపతులు, గైట్ ఎండీ కె.శశికిరణ్ వర్మ, వెంకటలక్ష్మీ దంపతులతో తిరుపతికి చెందిన దివి బాలాజీ దీక్షితులు శ్రీస్వామి, అమ్మవార్లకు వైభవోత్సవాన్ని నిర్వహించారు. చివరి రోజు మహా సుదర్శన యజ్ఞం, నిత్య కైంకర్యాలతో శ్రీవారి వైభవోత్సవం కన్నుల పండువగా ముగిశాయి. మురమళ్లకు చెందిన వేద పండితులు గంటి సుబ్రహ్మణ్యంశాస్త్రి ఘనాపాటి బ్రహ్మత్వంలో పూర్ణాహుతి చేపట్టారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనా వద్ద ఉంచిన సింహాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం దివ్య రథాల్లో కొలువైన స్వామివార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, సీఐ పి.కాశీవిశ్వనాథ్, క్షత్రియ పరిషత్ ప్రముఖులు సత్యనారాయణరాజు, కృష్ణంరాజు పూర్ణాహుతి క్రతువులో పాల్గొన్నారు.

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

యానాం, జనవరి 8: యానాం నియోజవర్గంలోని జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 20వ యానాం ప్రజా ఉత్సవాలు సోమవారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహించింది. గురువారం ఆర్ ప్యాక్టర్ అధినేత వీఎస్‌రాజు నేతృత్వంలో ప్రముఖ గాయకులు శ్రీకృష్ణ, సాయి శిల్ప, స్వాతి సత్యభామ, హనుమాన్, సాయిచరణ్, సాయి సింధూర తదితరులు ఆలపించిన సినీ గీతాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. యాంకర్, ప్రముఖ సింగర్ స్వాతి సత్యభామ ఉత్తేజపరిచే విధంగా యువతను ఉర్రూతలూగించారు. అనంతరం నృత్య పోటీలలో గెలుపొందిన వారు ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం జితేంద్ర చేసిన మిమిక్రీ అలరించింది. కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రఘునాయగం, భక్తవత్సలం నేతృత్వంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.


పాటలు పాడుతున్న శ్రీకృష్ణ బృందం

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



రాజవొమ్మంగి జనవరి 8: రాజవొమ్మంగి మండలంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఒ యువకుడు మృతిచెందాడు. జడ్డంగి ఇన్‌చార్జి ఎస్ఐ వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కుంజం ప్రవీణ్ (29) సంజీవనగరం గ్రామం నుంచి చెరుకుంపాలెం వైపుగా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చెరుకుంపాలెం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

అంతరాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

చింతూరు, జనవరి 8 : చింతూరులో ఈ నెల 11, 12 తేదీలలో అంతరాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూనెం కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

యూటీఎఫ్ నాయకులకు పోలీసుల నోటీసులు


నోటీసు అందిస్తున్న పోలీసులు

కూనవరం, జనవరి 8: జనవరి 9,10 తేదీలలో విజయవాడలోని ధర్నాచౌక్ సెంటర్‌లో జరిగే ధర్నాకు వెళ్లొద్దంటూ కూనవరం మండలం యూటీఎఫ్ నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, రావాల్సిన బకాయిలకు ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని దీంట్లో భాగంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అయితే ధర్నాలకు దిగొద్దంటూ, పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు వెళ్లి ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు తెలిపారు.

'విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే'


మాట్లాడుతున్న అనిల్

కూనవరం, జనవరి 8: గిరిజన సంక్షేమ హాస్టల్‌లో జరుగుతున్న విద్యార్థుల మరణాలన్ని ప్రభుత్వ హత్యలే అని ఆదివాసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్ అన్నారు. ఏజెన్సీలోని విద్యార్థులు పలు ఆశ్రమ పాఠశాలల్లో చనిపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందించకపోవడం కారణంగానే ఈ మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో ఏఎన్ఎంలు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. నర్సింగపేటలో ఏ విద్యార్థికి అయినా అనారోగ్యం వస్తే వంట మనిషితో ఆస్పత్రికి పంపిస్తున్నారని ఆయన విమర్శించారు. నర్సింగపేటలో ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే ఓ విద్యార్థి చనిపోయిందని ఆయన అన్నారు. గిరిజన సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై పోరాటం సాగిస్తామని అన్నారు. పేరుకే ఏజెన్సీ జిల్లా అని సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ఐటీడీఏ పీవో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని గిరిజన సమస్యలు పరిష్కరించాలన్నారు.

కాకినాడ

నేడు,రేపు గిరిజన కమిషన్ సభ్యుడు పర్యటన

ప్రత్తిపాడు, జనవరి 8: ప్రత్తిపాడు మండలంలో ఈ నెల 9,10న రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ పర్యటించనున్నారని ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వంకర్ నాయక్ 9న ఉదయం మండలంలోని మెట్టిచింత, గిరజనాపురం, వంతాడ గ్రామాల్లో... 10న పొదురుపాక, పాండవుల పాలెంలో పర్యటిస్తారని ఎంపీడీవో వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కార్మికులు విధులకు హాజరుకావాలి : కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 8: పారిశుధ్య కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున కార్మికులు తక్షణం సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు కోరారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్, కార్మిక సంఘాల ప్రతినిధులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేక అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలు జరిపిన నేపథ్యంలో అనేక అంశాలపై సానుకూలంగా స్పందించిందన్నారు. ప్రధాన డిమాండ్ల విషయంలో స్పష్టత వచ్చినందున పారిశుధ్య కార్మికులు విధులకు హాజరుకావాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోణా శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ఫోన్ ద్వారా వివిధ ప్రాంతాల ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. అనంతరం నిర్వహించిన స్పందనలో వినతులు స్వీకరించి తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ అధికారుల పాల్గొన్నారు.

'అన్ని దానాల్లోను అన్నదానం గొప్పది'

జగ్గంపేట, జనవరి 8: అన్ని దానాల్లోను అన్నదానం గొప్పదని, అన్నార్తుల కోసమే అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. గత 11 నెలలుగా ప్రతీ సోమవారం జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో గండేపల్లి మండలం తాళ్ళూరుకు చెందిన దివంగత పైణ్ణి తాతారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రవీణ్ ఆర్థిక సాయంతో భోజనాలు ఏర్పాటు చేయగా నవీన్ పేదలకు భోజనాలు వడ్డించారు. 2024లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు మళ్లీ అన్న క్యాంటీన్లను కొనసాగిస్తారన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, నీలామంతుల వీరబాబు, పాలచర్ల సత్యనారాయణ, పైణ్ణి వెంకటేశ్వరరావు, బి.సురేష్, డి.సత్తిబాబు పాల్గొన్నారు.

'ధర్మాన్ని రక్షించడం మాతృమూర్తులకే సాధ్యం'

పిఠాపురం, జనవరి 8: ధర్మాన్ని పరిరక్షించడమే మాతృమూర్తులకే సాధ్యమవుతుందని సమరసత సేవా ఫౌండేషన్ ఆంధ్ర ప్రాంత సహ సంయోజక్ ఈశ్వరయ్య అన్నారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో సోమవారం ఫౌండేషన్ జిల్లా మహిళా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మ ఒడి, బడి, గుడి సక్రమంగా ఉంటే భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించబడతాయన్నారు. సమావేశంలో గోదావరి జోన్ ధర్మప్రచారక్ తోట జగన్నాథం, జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు, మహిళా కన్వీనర్ గంధం వెంకటలక్ష్మి, సహ కన్వీనర్ వాసంశెట్టి సూర్యావతి, వరహాలబాబు, నారాయణరావు, కట్టా బంగారాజు, వివిధ మండలాల కన్వీనర్లు, సహ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

'సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి జరుపుకోవాలి'

గండేపల్లి, జనవరి 8: సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలని కుటుంబ సమేతంగా సంతోషంగా గడపాలని సీఐ ఎస్.లక్ష్మణరావు, ఎస్ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. సోమవారం కోడిపందేలు జరుగుతాయన్న సమాచారం ఉన్న మురారి, గండేపల్లి, ఎన్టీరాజపురం, మల్లేపల్లి, నీలాద్రిపేట, తదితర గ్రామాల్లో పరిశీలించిన పందేలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉన్న ప్రదేశాల్లో నిఘా పెట్టారు. పండుగ రోజుల్లో ఎక్కడైనా రహస్యంగా కోడిపందేలు, గుండాల, పేకాట, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. పండుగ రోజుల్లో అన్నిగ్రామాల్లో పోలీస్ గస్తీ ఉంటుందన్నారు.

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు'

కరప, జనవరి 8: సంక్రాంతి పేరుతో ఎవరైనా గుండాట, కోడిపందేలు నిర్వహణ, కోడిపుంజులకు కత్తి కట్టడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉప్పలంక, గురజనాపల్లి, గొర్రిపూడి, వేళంగి, వేములవాడ గ్రామాల్లోని పాత నేరస్తులను 38 మందిపై కరప ఎస్ఐ టి.రామకృష్ణ ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసి తహశీల్దార్ కోర్టులో హాజరుపరచగా కౌన్సెలింగ్ ఇచ్చారు.

పెద్దాపురంలో న్యాయవాదుల ధర్నా

పెద్దాపురం, జనవరి 8: అధికార ముసుగులో రాజకీయ జోక్యాన్ని ప్రేరేపించే నల్ల చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని పెద్దాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు వద్ద న్యాయవాదులు సోమవారం ధర్నా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం (మణి) మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉందని, తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు బుగత శివ, జి.సత్యనారాయణ, కె.రాయుడు, విజయ్‌కుమార్, మడికి రాంబాబు, నరసింహారావు, రామచంద్రరావు, రాగం కామేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నవరంలో...

అన్నవరం, జనవరి 8: ప్రభుత్వం ప్రవేశబెట్టిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం వల్ల ప్రజల ఆస్తులు, న్యాయవాదులకు తీవ్రనష్టం వాటిల్లితుందని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం ఉదయం సత్యదేవుడి తొలిపావంచా వద్ద న్యాయవాదులు టెంకాయికొట్టి నిరసన వ్యక్తంచేశారు. జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యదర్శి మదుబాబు, కోశాధికారి జోన్నాడ రాజేష్, రాయి శ్రీను, గౌరీశంకర్, యడ్ల శ్రీను, న్యాయవాదులు ఉన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్టుపేపర్స్ బుక్స్ అందజేత

గొల్లప్రోలు రూరల్, జనవరి 8: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు తోడ్పాటునందించేందుకు వ్యాపారవేత్త, స్థానిక రైసుమిల్లు అధినేత గొల్లపల్లి బాబీ ముందుకొచ్చారు. తన తండ్రి గొల్లపల్లి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులకు మోడల్ టెస్టు పేపర్ బుక్స్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాయుడు వెంకటేశ్వరరావు, టీవీ.శివప్రసాద్, హెచ్ఎంలు సీహెచ్.సూర్యప్రకాశరెడ్డి, అర్జునరావు, సూరిబాబు, దాడి పద్మనాభం, ఎం.సీతారామరాజు, ఎంవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ రజతోత్సవం

ప్రత్తిపాడు, జనవరి 8: ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ ఏర్పాటై 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా క్లబ్ నిర్వాహకులు రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. లయన్స్ కమ్యూనిటీ హాల్లో చాటర్ నైట్ ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, లయన్స్ గవర్నర్ ఎ.గోపాలరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. లయన్స్ క్లబ్ సమకూర్చిన గొడుగులను ఎమ్మెల్యే, గర్నవర్ కార్మికులకు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు వి.చంద్రమోహన్‌బాబు వై.రెడ్డినాయుడు, డి.ఫకీర్‌రాజు, గుడాల వెంకటరత్నం రజతోత్సవాల విశిష్టతను వివరించారు. డాక్టర్ వి.ప్రసాద్, పి.కాళిదాసు, పి.సుధీర్, జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. తొలుత వారు పోలిమేరు గ్రామంలో విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర వస్తువులు, ప్రత్తిపాడులో 50 మంది వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సామర్లకోట, జనవరి 8: పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎమ్ తోటకూర సాయిరామకృష్ణ సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు, రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

ప్రత్తిపాడు: ధర్మవరం హైస్కూల్‌లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. ఏలేశ్వరంలో గురుకుల పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు సంబరాల్లో నిర్వహించిన బొమ్మల కొలువు, పిండి వంటల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. గురుకులంలో భోగిమంటలతో ఉపాధ్యాయులు విద్యార్థులు సందడి చేశారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సలార్, డెవిల్ బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ 1	:	కపాలదీవి
సీ అండ్‌సీ 2	:	సలార్
శ్రీప్రియ	:	పిండం
పద్మప్రియ	:	యానిమల్
సత్యగౌరి	:	పిండం
సూర్య 1	:	డెవిల్
సూర్య 2	:	సలార్

అందని పింఛన్లు!

రౌతులపూడి, జనవరి 8: ప్రతి నెల 1వ పింఛన్ సొమ్ములను వలంటీర్లు ఇచ్చేవారు. కానీ 1వ తారీఖ దాటి వారం అయినా మండలంలో ఇంకా పింఛన్లు అందలేదు. పండగ కావడంతో ఇంకా పింఛన్లు ఇవ్వకపోవడంతో పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జ్‌ను మార్చారు. దీంతో ఇన్‌చార్జి చేతులు మీదుగానే పింఛన్లు పంచుతారని జోరుగా ప్రచారం జరుగుతుంది. పింఛన్ల పంపిణీ ఆలస్యమవ్వడంతో మండలంలోని సూమారు 7 వేలమంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

తరలిరావాలని టీడీపీ, జనసేన నేతల పిలుపు



సర్పవరం జంక్షన్: పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 8: తునిలో ఈనెల 10న టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించే తెలుగుదేశం పిలుస్తోంది రా కదిలి రా సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ పిలుపునిచ్చారు. గొడారిగుంటలో పార్టీ శ్రేణుల సమావేశంలో ఛలో తుని పోస్టర్‌ని ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శిరంగు శ్రీనివాసరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తాటికాయల వీరబాబు, మాదారపు తాతాజీ,పుల్ల శ్రీరాములు, సోదె ముసలయ్య, పుల్ల వీరబాబు, ఛైర్మన్ శ్రీను ఉన్నారు.

చంద్రబాబు సభ విజయవంతానికి టీడీపీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసులు కోరారు. వలసపాకల, రమణయ్యపేటలో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, చంద్రబాబు-జనసేన పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. చంద్రబాబు సభను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు.

కాకినాడసిటీ: చంద్రబాబు సభకు పెద్దఎత్తున కాకినాడ నుంచి తరలివెళ్లాలని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. టీటీడీ కళ్యాణ మండపం వెనుక సమావేశం నిర్వహించారు. క్లస్టర్ వారీగా పది క్లస్టర్ల సమావేశాలు నిర్వహించిన కొండబాబు, నియోజకవర్గ పరిశీలకులు అమలాపురం మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, పెచ్చెట్టి విజయలక్ష్మి చర్చించారు. నల్లూరి శ్రీనివాస్, ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, ఎం.గంగాధర్, మెంటారావు, నల్లూరి తులసి, కాపాడి రాజు, అనిల్ పాల్గొన్నారు.

జగ్గంపేట: టీడీపీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగింది. రా కదిలిరా కార్యక్రమ పరిశీలకుడు శీలం వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభ విజయవంతానికి 4 మండలాల పరిశీలకులు రెడ్డి మణేశ్వరరావు, పితాని శివరామకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, ఆళ్ల గోవిందుకు సూచనలిచ్చారు. నియోజకవర్గం నుంచి జన సమీకరణ చేసి అధిక సంఖ్యలో తరలించాలన్నారు. కార్యక్రమంలో వ పార్టీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, మంగరౌతు రామకృష్ణ, చదరం చంటిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కన్నబాబు, దేవరపల్లి మూర్తి, వీరంరెడ్డి కాశీబాబు, జీను మణిబాబు, అనుకూల శ్రీకాంత్ , కొత్త కొండబాబు, రేఖ బుల్లిరాజు, ఉంగరాల రాము, పాంఢ్రంగి రాంబాబు, అడబాల భాస్కరరావు, ఈది అశోక్, బదిరెడ్డి అచ్చన్నదొర, జి.సీతారామచంద్రవర్మ ఉన్నారు.

శంఖవరం: తునిలో ఈనెల 10న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నిర్వ హించబోయే రా... కదలి రా బహిరంగ సభకు ప్రతీఒక్కరూ హాజరుకావాలని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ కోరారు. మండలంలోని వజ్రకూటం, కత్తిపూడి, నెల్లిపూడి, కొంతంగి, మండపం గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి ఇంటింటా తిరిగి సభను విజయవంతం చేయాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, వెన్నా శివ, కొమ్ముల కన్నబాబు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుబాష్, వీరభద్రరావు, బద్ది రమణ, పోలం చిన్నా పాల్గొన్నారు.

కోటనందూరు: చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన కోటనందూరు మండలాధ్యక్షుడు పెదపాత్రుని శ్రీనివాస్ కోరారు.

కరప: కరప రామకంచి రాజు నగర్ నందు టీడీపీ మండలాధ్యక్షుడు దేవ్ వెంకన్న ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆ రోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు కోనా వెంకటలక్ష్మి, బూత్ కన్వీనర్ తోట వెంకటేశ్వరరావు, మేడిశెట్టి పాండురంగ, కొప్పిశెట్టి నాగబాబు, వనుం ఉపేంద్రనాద్ పాల్గొన్నారు.



జగ్గంపేటలో మాట్లాడుతున్న శీలం వెంకటేశ్వరరావు

'అంగన్‌వాడీలకు అండగా ఉంటాం'

పెద్దాపురం, జనవరి 8: అంగన్‌వాడీలకు మ ద్దతుగా ఉంటామని టీడీపీ, జనసేన, సీపీఎం నేతలు పేర్కొన్నారు. గత 28 రోజులుగా తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని వారు చేస్తున్న సమ్మెకు సోమవారం నాయకులు మద్దతు తెలియచేశారు. మున్సిపల్ జంక్షన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెను ఉద్దేశించి జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ పట్టణాధ్యక్షుడు రంధి సత్యనారాయణ, సీపీఎం నేత కరణం ప్రసాదరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం చాలా దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలకు తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, సీపీఎం నేతలు తూతిక రాజు, కొరిపూరి రాజు, పొలమరశెట్టి సత్తిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగిన దీక్షలు

కరప: కరప తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని అంగన్‌వాడీలు కాకినాడ రూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీరవేణి, కరప ప్రాజెక్టు నాయకురాలు ఎస్.వరలక్ష్మి, ఎం.భవాని, బి.ఆశరత్నం నిరసన దీక్ష చేపట్టారు.

తుని రూరల్: తునిలో అర్బన్, రూరల్ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. తమపై ఎస్మా ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సీఐటీయూ నాయకులు శ్రీని వాస్, ఉమామహేశ్వరి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

'రానున్నది టీడీపీ ప్రభుత్వమే'

తొండంగి, జనవరి 8: రానున్నది నూటికి నూరుపాళ్లు టీడీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. సోమవారం శృంగవృక్షం గ్రామానికి చెందిన దళితులు పెద్ద ఎత్తున టీడీపీలో చేరగా వారికి కృష్ణుడు పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలంతా వైసీపీకి వ్యతిరేకంగా ఒక్కటై టీడీపీకి మద్దతు పలుకుతున్నారన్నారు. కొవ్వూరి సత్యన్నారాయణ, పులుగు గంగరాజు, దిమ్మిలి సామ్యూల్, బోడపాటి సత్యన్నారాయణ, రజాల కొండబాబు పలువువు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. టీడీపీ నేతలు పేకేటి హరికృష్ణ, మురాలశెట్టి సత్యన్నారాయణ, పిల్లి బాబ్జి, బూర్తి కృష్ణ, బండి చిట్టిబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే సుపరిపాలన'

తుని రూరల్, జనవరి 8: చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య తెలిపారు. కేవో మల్లవరం గ్రామంలో ఆమె సోమవారం ఇంటింటా ప్రచారం చేపట్టి రానున్న ఎన్నికల్లో అరాచక పాలనకు చరమగీతం పాడి, ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపించాలని కోరారు. టీడీపీ, జనసేన మేనిఫెస్టోతో అన్నివర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణ, చిటికెల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

'ప్రజల కోసం జనసేన'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 8: వైసీపీ ప్రభుత్వ ఆగడాలను ఎక్కడికక్కడ వ్యతిరేకిస్తూ ప్రజల కోసం జనసేన ఉందంటూ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, చెంచులక్ష్మి ఆధ్వర్యంలో డోర్‌టూడోర్ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న దారుణాలు, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ జనసేనాని సారథ్యంలో పార్టీ వీటిపై ఎలా పోరాడుతుందో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, డివిజన్ నాయకులు కుసుమూర్‌కాన్, దారపు సతీష్, సమీర్ జనసైనికులు పాల్గొన్నారు.

'సేవలు సద్వినియోగం చేసుకోండి'

పెదపూడి, జనవరి 8: సామాజిక ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో అందిస్తున్న ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతు విభాగం నాయకుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోరా వీర్రాజు చౌదరి అన్నారు. సోమవారం పెదపూడి సీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ తరహాలో వైద్యం అందించడమే కాకుండా స్పెషలిస్టు వైద్యులు కూడా అందుబాటులో ఉంటున్నారన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు కాకర సాయిబాబు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు

రౌతులపూడి, జనవరి 8: తాగునీరు వృధా చేస్తే కన్నీరు రౌతులపూడిలో సచివాలయంపై బోర్డు రాశారు. కానీ ఆ బోర్డుకు దగ్గరే తాగునీరు వృధాగా పోతుంది. సిబ్బంది సచివాలయంలోనే ఉంటున్నారు కదా బోర్డుపై రాయడం కాదు ముందు వృధా అరికట్టండని పలువురు అంటున్నారు.



రౌతులపూడిలో వృథాగా పోతున్న తాగునీరు

రైతులను మోసగించిన సీఎం జగన్

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



నిరాహార దీక్ష చేస్తున్న రైతులు, వర్మ

పిఠాపురం, జనవరి 8: ఏలేరు ఆధునీకరణకు నిధులిస్తామని సీఎం జగన్ ప్రకటించి ఇవ్వకుండా రైతులను మోసగించారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. టీడీపీ హయాంలో మంజూరైన ఏలేరు ఆధునీకరణ పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం, తిరిగి పనులు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ పిఠాపురం పట్టణం, రాయవరం సెంటర్, ఎఫ్‌కేపాలెం, విరవాడ సెంటర్లో వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులు సోమవారం నిరాహారదీక్షలు చేపట్టారు. శిబిరాలను వర్మ సందర్శించి సంఘీభావం తెలిపారు. టీడీపీ హయాంలో ఏలేరు ఆధునీకరణ పనులకు అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని వాటిని ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు తమకు అవసరం లేదని చెప్పి రద్దు చేయించారని తెలిపారు. దీనికి నిరసనగా పాదయాత్ర తలపెడితే భారీగా పోలీసు బలగాలను మోహరించి అడ్డుకున్నారని చెప్పారు. తదనంతరం పలుమార్లు ఆందోళనలు తెలిపేందుకు, సీఎం జగన్ జిల్లాకు వచ్చినప్పుడు కలిసేందుకు ప్రయత్నిస్తే పోలీసులతో అడ్డగించారని విమర్శించారు. గొల్లప్రోలులో జరిగిన కాపు నేస్తం సభలో ఏలేరు ఆధునీకరణకు రూ.156కోట్లు ఇస్తామని ప్రకటించారని, ఇది జరిగిన ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ ఒక్క పైసా నిధులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పురుషోత్తమపట్టణం ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలో 2 పంటలకు పుష్కలంగా సాగునీరందిస్తే వైసీపీ పాలనలోకి రాగానే కరెంటు బిల్లులు చెల్లించకుండా జగన్ దానిని నిరుపయోగంగా మార్చారన్నారు. దీక్షల్లో టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధరరావు, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు, సకుమళ్ల నాగబాబు, పిల్లా సురేష్, నెక్కల సత్యనారాయణ, రామిరెడ్డి అప్పన్న, బెజవాడ సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసీపీ సైకో పాలన పోవాలి

ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ



శరభవరంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 8: రాష్ట్రంలో వైసీపీ సైకో పాలన పోవాలని.. జగన్‌ని గద్దె దించేందుకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా పిలుపునిచ్చారు. మండలంలోని శరభవరం, గజ్జెనపూడి, చింతలూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ సైకో ప్రభుత్వానికి చరమగీతం పాడి టీడీపీ, జనసేనల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. ఈ నెల 10న తునిలో నిర్వహించే చంద్రబాబు నిర్వహించే రా కదలిరా బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. సమావేశాల్లో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబుఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి), పల్లాగోపి, అమరాది వెంకట్రావు, యాళ్ల జగదీష్, పోల్నాటి భగవాన్ పాల్గొన్నారు. ఏలేశ్వరం మండలం తిరుమాలి, ఎర్రవరంలో సత్యప్రభ ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కృష్ణ, ప్రత్తిపాడు పార్టీ పరిశీలకుడు మెట్ల రమణబాబు పాల్గొన్నారు. ఒమ్మంగిలో వరుపుల రాజా మోమోరియల్ క్రీడా పోటీలను సత్యప్రభ ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ఎన్ రాజు(మీసాలరాజు), నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణ స్వామి, ఇళ్ళ అప్పారావు, అంబటి రాంబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడించిన కార్మికులు



పెద్దాపురంలో ముట్టడించిన కార్మికులు

పెద్దాపురం, జనవరి 8: సమాన పనికి సమాన వేతనమివ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు పలు డిమాండ్లతో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేపట్టిన సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీపీఎం నాయకుడు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వారి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదన్నారు. కార్మికుల సమ్మెకు టీడీపీ, జనసేన నేతలు మద్దతు తెలియచేశారు. శివకోటి అప్పారావు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ముట్టడి

గొల్లప్రోలు, జనవరి 8: డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగారు. కార్యాలయంలోకి ఎవ్వరు వెళ్లకుండా అడ్డుకున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనంగా రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేత నందీశ్వరరావు, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఏసమ్మ, లోవబాబు, సత్యవతి, రామారావు, రాజులు, రాజమోహన్ తదితరులున్నారు.

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో యూనియన్ అధ్యక్షుడు బొచ్చా శ్రీను, కశిం కోట ఆనందరావు, కిషోర్‌బాబు, అల్లం పార్వతి, గూడుపు దానమ్మ, వేల్పుల సింహాచలం, సిరం శెట్టి రమణమ్మ, అజారపు లోవరాజు, పెను మాకుల శారమ్మ, అర్జి అప్పలనర్సమ్మ, బంగారు కొండమ్మ పాల్గొన్నారు.

13 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్రచికిత్స



సామర్లకోట, జనవరి 8: సామర్లకోట ఏడీబీ కోడ్డులో మెడికవర్ ఆసుపత్రిలో వైద్యబృందం ఆస్టియో సార్కోమా క్యాన్సర్‌తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఆసుపత్రిలో విలేకర్లతో ఆసుపత్రి క్లస్టర్ హెడ్ డాక్టర్ సిద్దారెడ్డి, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ సుదర్శన రెడ్డి ఈసీబీఆర్ శస్త్రచికిత్స ప్రాధాన్యతను వివరించారు. బాలుడి ఎడమ భుజం ఎ ముకలో ట్యూమర్(కణితి) ఉన్నట్లు ప్రాథమికంగా తమ బృందం గుర్తించిందన్నారు. భుజము నుంచి విడదీసిన ఎముకకు రేడియేషన్ చేసి క్యాన్సర్ కణజాలాన్ని తొలగించడం జరిగిందన్నారు. రేడియేటెడ్ చేసిన ఎముక భాగాన్ని తిరిగి బాలుడి చేతికి అమర్చి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తిచేశామన్నారు. ఆర్‌గౌతమ్‌రామ్, డీఎంఎస్ శ్రీకాంత్, ఖాద్రి పాల్గొన్నారు.

నేడు తొండంగి మండల సమావేశం

తొండంగి, జనవరి 8: తొండంగి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో పసుపులేటి సతీష్ తెలిపారు. మండలాధ్యక్షురాలు దడాల సువర్ణలత అధ్యక్షతన జరిగే సమావేశంలో మండల సవరణ బడ్జెట్ 23-24, అంచనా బడ్జెట్ 24-25పై సమీక్ష, ఆమోదం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

సామర్లకోటలో...

సామర్లకోట, జనవరి 8: సామర్లకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ బి.సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డి.శ్రీలలిత తెలిపారు. సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

కరప, జనవరి 8: మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఈనెల 10న ప్రారంభవుతాయని ఎంపీడీవో కె.అప్పారావు తెలిపారు. నిర్దేశించిన ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో పోటీలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండల పరిషత్ సమావేశంలో సోమవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పీడీలు,పీఈటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సమీక్షించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

సామర్లకోట, జనవరి 8: ప్రభుత్వం ముద్రించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం ఎంఈవో-2 పి.పుల్లయ్య అందజేశారు. సామర్లకోట ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఎంఈవో మాట్లాడుతూ సామర్లకోట మండల, పట్టణ పరిధిలో 315 మంది తెలుగుమీడియం విద్యార్థులకు, 762 మంది ఆంగ్లమీడియం విద్యార్థులకు మెటీరియల్ మంజూరైందన్నారు.

కోటి మట్టి శివలింగాల తయారీ

జగ్గంపేట, జనవరి 6: ఇర్రిపాకలో ఏలేరు నదికి పక్కన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం వద్ద నిర్వహించే మహాకుంభాభిషేకం కోసం కోటి మట్టి శివలింగాల తయారీలో అచ్యుతాపురం, జగపతినగరం, శృంగరా యునిపాలెం, గండేపల్లి, తిరుమలాపాలెం, మల్లవరం, గొల్ల లగుంట, మామిడాడ నుంచి వందలాది మంది పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ భోజనం ఏర్పాటు చేశారు.

జాతీయ శిక్షణకు కిషోర్ ఎంపిక

తాళ్లరేవు, జనవరి 8: జాతీయస్థాయి విద్యాశిక్షణకు తాళ్లరేవు జిల్లా పరిషత్ హైస్కూల్ అసిస్టెంట్ పుల్లేటి కిషోర్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు జె.ఆశాలత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రయోగశాలల నిర్వహణ వాటి వినియోగంపై విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా రూపొందించిన అంశాలతో మైసూర్ ప్రాంతీ విద్యాసంస్థ జాతీయ విద్యాశిక్షణ నిర్వహిస్తోంది. మైసూర్‌లో 3 రోజుల పాటు జరిగే ఈ శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా 29మంది ఎంపిక కాగా వారిలో తాళ్లరేవు మండలం నుంచి సైన్స్ ఉపాధ్యాయుడు పుల్లేటి కిషోర్ ఒకరని తెలిపారు. ఆయనకు ఎంఈవోలు మోకా ఉమ, మంగాయమ్మ, హెచ్ఎమ్, ఉపాధ్యాయులు వాకపల్లి అప్పారావు అభినందనలు తెలిపారు.

రవిశంకర్‌కు 'ఉత్తమ' అవార్డు

గండేపల్లి, జనవరి 8: ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ ఏపీటీ రాష్ట్ర శాఖ, వీజేఎస్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన రీసెంట్ డెవలప్‌మెంట్ ఛాలెంజస్ అండ్ స్కోప్ ఇన్ ఫార్మస్యూటికల్ రీసెర్చ్ జాతీయ సదస్సులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఆయనను విద్యాసంస్థల అధినేత శేషారెడ్డి, వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరెడ్డ తదితరులు అభినందించారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

జగ్గంపేట, జనవరి 8: మండలంలోని ఇర్రిపాకలో అయోధ్య రాములవారి అక్షింతలను రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ మనవ డు అనీష్ నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, సతీమ ణి లక్ష్మీదేవి పంపిణీ చేశారు.

షాదీఖానా భవనానికి శంకుస్థాపన

తుని రూరల్, జనవరి 8: మండలంలోని తాళ్ళూరు గ్రామంలో షాదీఖానా భవనానికి మంత్రి దాడిశెట్టి రాజా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కోతల సూర్యామణి, తమరాన శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కిరెడ్డి బాబు, నకురు నాగేంద్ర నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసుల్లో 72 మంది బైండోవర్

ప్రత్తిపాడు, జనవరి 8: ప్రత్తిపాడు సెబ్ సర్కిల్ పరిధిలో ని 72 మందిని పాత సారా కేసుల్లో ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం మండలాలకు చెందిన వారిని ఆయా మండల తహశీల్దార్ల వద్ద సీఐ పి.అశోక్ హాజరుపరిచారు. వారంతా పాత నాటుసారా, బెల్టుషాపుల్లో నిందితులని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్నదొర, దొరబాబు, రాజు, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, రాంబాబు, రామకృష్ణ, జ్యోతి ఉన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, జనవరి 8: ధనుర్మాసం సందర్భంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాల యంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈవో డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, జోగారావు, చెరుకూరి రాంబాబులు స్వామివారికి పంచద్రవ్యములతో అభిషేకించారు. పుష్పార్చన పూజలు, బాలాత్రిపురసుందరికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించారు.

'నా భూమికి రక్షణ కల్పించాలి'

తుని రూరల్, జనవరి 8: తనకు జిరాయితీ భూమి ఆక్రమణకు గురవుతుందని తుని తహశీల్దార్ శివకుమార్‌కు టీడీపీకి వి.కొత్తూరు మాజీ సర్పంచ్ భర్త తమరాన రామకృష్ణ ఫిర్యాదు చేశారు. తన స్థలానికి దగ్గరలో గల జగనన్న కాలనీ రోడ్డు 14 అడుగులు ఏర్పాటు చేసి ఆ రోడ్డు తన స్థలం వద్దకు వచ్చేసరికి రాజకీయ దురుద్దేశ్యంతో స్థానిక వైసీపీ నాయకుడు 30 అడుగులు పెంచేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ జిరాయితీ స్థలానికి రక్షణ కల్పించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పెద్దాపురంలో 'స్పందన'

పెద్దాపురం, జనవరి 8: స్పందనలో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించుకునే వీలుంటుందని ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన పలుఅర్జీలను స్వీకరించారు.